క్లుప్తంగా

ట్రినిటి విద్యార్థుల ఔదార్యం



నిత్యావసరాలు, పండ్లు అందజేస్తున్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీ ఈసీఈ ఎన్ఎస్ఎస్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు స్ఫూర్తి మానసిక దివ్యాంగ విద్యార్థులకు నిత్యావసర సరుకులు, బ్రెడ్, బిస్కట్లు అందజేశారు. విద్యార్థులు ఇలాంటి ఆలోచనతో ముందుకు రావడం అభినందనీయమని కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్ కొనియాడారు. ప్రిన్సిపాల్ మణిగణేశ్, ఏవో సురేశ్, రాజిరెడ్డి, రామ్మోహన్ ఉన్నారు.

యూజీడీ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న తేజస్వి

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని 11వ డివిజన్‌లో గురువారం రూ.10లక్షల పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన యూజీడీ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విప్రకాశ్ ప్రారంభించారు. 30ఏళ్లుగా డివిజన్ వాసులు ఈగలు, దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మేయర్, కమిషనర్ సహకారంతో నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించినట్లు కార్పొరేటర్ తెలిపారు. యూజీడీ నిర్మాణం అనంతరం సీసీరోడ్డు నిర్మాణం చేయిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు పెద్దెల్లి ప్రకాశ్‌తోపాటు కాలనీవాసులు ఈర్ల ఓదెలు, కేసరపు రాయపోషం, అద్దూరి దుర్గయ్య, రత్న సారయ్య, ఈర్ల అమతమ్మ, కండె రాజేశ్వరి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని భరత్‌నగర్ నుంచి మేడిపల్లి సెంటర్ వరకు ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌లోని చిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి 11 మీటర్ల ఎత్తు గల స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో అన్నపూర్ణ కాలనీ ఫీడర్ పరిధిలోని మేడిపల్లి, న్యూపోరట్‌పల్లి, అన్నపూర్ణ కాలనీ, భీమునిపట్నం, మేడిపల్లి సెంటర్, మార్కెట్ ఏరియా, ఆటోనగర్, సుభాష్ నగర్‌తో పాటు మోమిన్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ఆలయ పునర్ నిర్మాణానికి భూమిపూజ



ఎలిగేడు: మండల కేంద్రంలోని వీరహనుమాన్ ఆలయం శిథిలావస్థలో ఉండగా ఆలయ కమిటీ చైర్మన్ వెంగళదాసు రాజమౌళి, గ్రామస్తుల సహకారంతో ఆలయ పునర్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, హోమం వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహిచారు. వీరహనుమాన్ ఆలయం అతిపురాతనమైందని, వందల ఏళ్ల నాటి ఆలయం శిథిలావస్థలో ఉండగా పునర్ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ఆలయ కమిటీ కోరింది. సర్పంచ్ భూర్ల సింధూజ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లొంకకేసారం అభివృద్ధికి నిధులు కేటాయించండి



వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ మంజూర్

రామగిరి: మండలంలోని లొంకకేసారం గ్రామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ సర్పంచ్ ఎండీ.మంజూర్ గురువారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కలిసి వినతిపత్రం అందజేశారు. నూతనంగా ఏర్పడిన గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, కల్వర్టులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయన వెంట కల్వచర్ల మాజీ సర్పంచ్ దేవ రామస్వామి ఉన్నారు.

విద్యుత్‌బిల్లు వసూళ్లపై గృహజ్యోతి ఎఫెక్ట్

- రెండు నెలలుగా భారీగా తగ్గిన వైనం
- పథకం అమలుకోసం ఎదురుచూస్తున్న జనం



విద్యుత్ సబ్‌స్టేషన్

రామగుండం: కాంగ్రెస్ ప్రకటించిన గృహజ్యోతి పథకంలో కేటగిరి–1లో భాగంగా ప్రతీ గృహ విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్లలోపు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదు. దీంతో గత నెల నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపులు మందగించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కాగా ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా పథకాలను అమలు చేసింది. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని అమలు చేసే దిశగా కసరత్తు చేస్తుండడంతో విద్యుత్ వినియోగదారులు ఎదురు చూస్తున్నారు.

అంతర్గాం మండలంలో వసూళ్లు..

అంతర్గాం మండల పరిధిలో గృహ వినియోగదారుల సర్వీసులు 5,230 ఉండగా, నవంబర్‌లో వసూళ్ల లక్ష్యం రూ.32 లక్షలు కాగా కేవలం రూ.23లక్షలు మాత్రమే వసూళ్లయ్యాయి. ఇందులో రూ.4లక్షలు మిషన్ భగీరథ విద్యుత్ బిల్లులున్నట్లు అధికారులు పేర్కొన్నారు. డిసెంబర్‌లో రూ.38.6 లక్షలు కాగా కేవలం ఇప్పటివరకు రూ.69వేలు మాత్రమే వసూలైనట్లు అధికారులు పేర్కొన్నారు.

రామగుండం మండల వసూళ్ల లక్ష్యం..

రామగుండం పరిధిలో 7,082 గృహ వినియోగ సర్వీసులుండగా, నవంబర్ నెలలో రూ.47.81 లక్షలు లక్ష్యం కాగా రూ.45.26 లక్షలు వసూలయ్యాయి. డిసెంబర్ నెలలో రూ.47.50 లక్షల వసూళ్ల లక్ష్యం. కాగా ఇప్పటివరకు కేవలం రూ.3.08 లక్షలు మాత్రమే వసూలైనట్లు అధికారులు వెల్లడించారు.

గృహజ్యోతితోనే కలెక్షన్ తగ్గుముఖం



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గృహజ్యోతి పథకంలో భాగంగా 200లోపు వినియోగించుకున్న విద్యుత్ యూనిట్లకు ఎలాంటి బిల్లులు చెల్లించే అవసరం లేదని పేర్కొన్నారు. దీంతో చాలా మంది వినియోగదారులు బిల్లుల చెల్లింపుల్లో అలసత్వం వహిస్తున్నారు. గృహజ్యోతి పథకం అమలుపై మాకు ఎలాంటి గైడ్‌లైన్స్ అందలేదు. నెలవారీగా చెల్లించాల్సిన బిల్లులు సత్వరమే చెల్లించి మాకు సహకరించాలి.

– ఆశ శంకర్, ఏఈ, అంతర్గాం

ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆటోడ్రైవర్లు

జూలపల్లి: మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల సంఘం మండల అధ్యక్షుడు మద్దెల నరేశ్, ఉపాధ్యక్షుడు ఆయూబ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లు గురువారం తమకు ఉపాధి కల్పించాలని కోరారు. మహాలక్ష్మి పథకం రద్దు చేయాలని లేదా పింఛను ఇవ్వాలని నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. పోలీసుల జోక్యంతో ధర్నా ఆపివేసి, ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ బషీరోద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేదలు, నిరుద్యోగులు ఆటోలను నమ్ముకుని బతుకుతున్నామని, ఆర్టీసీ బస్సుల్లో ప్రవేశపెట్టిన మహాలక్ష్మితో ఆటోడ్రైవర్ల కుటుంబాలు బజారున పడ్డాయని, ప్రభుత్వం తమను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు. ఆటోలు నడుపుకుని బతుకుతున్న ప్రతి కుటుంబానికి నెలకు రూ.5వేల పింఛను అందజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వేల్పుల సందీప్, దామ రవి, ఒల్లాజీ మహేందర్, ఉయ్యాల వెంకటేశ్, ఇంజపురి సోనీ, కోడి ప్రేమ్‌కుమార్, కుర్ర సతీశ్, పసునూటి లక్ష్మన్, కల్లెపెల్లి కిషన్, అమరగాని ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం



జ్యోతినగర్: సన్మానిస్తున్న కొలిపాక సుజాత



కమాన్‌పూర్: మంత్రితో కాంగ్రెస్ నాయకులు

జ్యోతినగర్: రామగుండం మున్సిపల్ 24వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక సుజాత–మల్లయ్య గురువారం రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబును గురువారం హైదరాబాద్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఎన్టీపీసీ పట్టణ ఆర్యవైశ్య సంఘం పొలిటికల్ అడ్వయిజర్ రావికంటి వరప్రసాద్ మంత్రిని సన్మానించారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కమాన్‌పూర్: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును గురువారం కాంగ్రెస్ మండల నాయకులు హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసి వారిలో పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు, ఆడెపు రమేశ్, తిరుపతి ఉన్నారు.

శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షలు

మంథని: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు గురువారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి, మంథని డివిజన్ మీడియా కన్వీనర్ ఇనుముల సతీశ్ తిరుమల తిరుపతి వెంకన్న ప్రసాదం అందించి టీటీడీ శాలువాతో సత్కరించారు. అలాగే మంథని ఎంపీపీ కొండ శంకర్, రైతు సంఘం నాయకుడు మూల పురుషోత్తం రెడ్డితో పాటు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ముత్తారం నుంచి..

ముత్తారం: హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మాజీ జెడ్పీటీసీలు నాగినేని జగన్‌మోహన్‌రావు, చొప్పరి సదానందం, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాటారం నాయకుడు బండ వసంత రెడ్డి, తదితరులు ఉన్నారు.

రామగుండం: మంత్రి శ్రీధర్‌బాబును గురువారం కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వంతోనే మైనార్టీల అభివృద్ధి

సుల్తానాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మైనార్టీల అభివృద్ధి సంక్షేమం సాధ్యమవుతుందని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పినట్లు కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే అక్బర్ అలీ తెలిపారు. గురువారం హైదరాబాద్ కార్యాలయంలో మంత్రి శ్రీధర్‌బాబు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన అనుచరులతో వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

కమలేశ్ చంద్ర కమిటీ సిఫార్సు అమలు చేయాలి



సమ్మెలో యూనియన్ డివిజన్ సెక్రటరీ శంకరయ్య



సమ్మె చేస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

సుల్తానాబాద్: కేంద్ర ప్రభుత్వం కమలేశ్ చంద్ర కమిటీ సిఫార్సును వెంటనే అమలు చేయాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్‌సేవక్ యూనియన్ డివిజన్ కార్యదర్శి బ్రాహ్మణపల్లి శంకరయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలోని పోస్టాఫీస్ ఎదుట చేస్తున్న సమ్మెను ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 578 మంది డాక్‌సేవకులు ఉన్నారని, వారి ద్వారానే గ్రామాల్లో సేవింగ్, రికరింగ్ డిపాజిట్లు చేస్తున్నామని, ఆసరా పెన్షన్లతో పాటు ఇతర సేవలు సైతం కేంద్ర ప్రభుత్వం తమతో వెట్టిచాకిరీ చేపిస్తోందన్నారు. పనిగంటలు 8గంటలే ఉండాలని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. రెగ్యులర్ జీడీఎస్‌లు సెలవు పెట్టినప్పుడు వర్క్‌లోడ్‌తో సంబంధం లేకుండా ఇతరులకు అనుమతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండీ సుల్తాన్, తిరుపతి, సమ్మయ్య, రాజారత్నం సుకుమార్, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

కాల్వశ్రీరాంపూర్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని తపాలాశాఖ ఉద్యోగులు స్పష్టం చేశారు. డిమాండ్లు పరిష్కరిచాలంటూ వారు చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. కమలేష్‌చంద్ర కమిటీ సిఫారసులను వెంటనే అమలు చేయాలని యూనియన్ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, రాజ్‌మహ్మద్, జావిద్, అలీ, శివ, సంతోష్, అజయ్, చందు, కలీం, ఆమని తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం



అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్: అల్ఫోర్స్ విద్యాసంస్థలు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తున్నారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో అఖిలశ్రీ విద్యార్థిని అభినందించారు. ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన మహిళల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. అఖిలశ్రీ భవిష్యత్‌లో జాతీయస్థాయిలో రాణించి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

కుట్టుశిక్షణ మహిళలకు ప్రశంస పత్రం



ప్రశంస పత్రాలతో మహిళలు

గోదావరిఖనిటౌన్: విశ్వహిత సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణా కేంద్రంలో నేర్చుకున్న మహిళలకు విశ్వహిందూ పరిషత్ కేంద్రియ సహాయ కార్యదర్శి, విశ్వహిత సేవాట్రస్ట్ దక్షిణ భారత కార్యదర్శి గుమ్మల సత్యంజీ స్థానిక శారదానగర్‌లోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ప్రశంస పత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుమ్మల సత్యంజీ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పేద మహిళా అభ్యున్నతి, స్వావలంబన కోసం ఉచిత శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్, ప్రాంత గోరక్షక్ ఇసంపల్లి వెంకన్న, శిక్షకురాలు ఆరెల్లి మమత, జిల్లా బాధ్యులు అడిగొప్పుల రాజు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పారదర్శకంగా నిర్వహించాలి

జూలపల్లి: గ్రామాల్లో బీఎల్‌వోలు ఓటరు నమోదు, సవరణను పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దారు బషీరోద్దీన్ ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో గురువారం అంగన్వాడీ టీచర్లు, బీఎల్‌వోలకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 2023 వరకు 18 ఏళ్లు నిండిన యువతను కొత్త ఓటరుగా నమోదు చేయాలని, ఓటరు లిస్టులో తప్పులున్నా, గ్రామం మారినా ఓటరు లిస్టులో సవరణ చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌ఐలు సదయ్య, సంపత్, బీఎల్‌వోలు రాజనర్సమ్మ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠ



ఆలయంలో పూజలు

పెద్దపల్లిరూరల్: మండలంలోని అప్పన్నపేట శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో గురువారం విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. అర్చక బృందం ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. యాగశాలలో హోమయజ్ఞం నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభరోహణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సర్పంచ్ చీకటి స్వరూప, నాయకులు పోచాలు, రాజేందర్, భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాజిరెడ్డి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు భిక్ష



సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో అయ్యప్పస్వామి దీక్ష తీసుకున్న స్వాములకు పారిశ్రామికవేత్త పల్లామురళి–సదాలక్ష్మి, పల్లా శరత్–సౌమ్య కూతురు వరూధిని కుటుంబ సభ్యులు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి సాయిరి మహేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు చేసి తీర్థ ప్రసాదాలను అందించారు. కమిషనర్ మల్లికార్జున్ గురుస్వాములు మహేందర్, మిట్టపల్లి మురళీధర్, వెంకటేశ్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్‌ను వినియోగించుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం సుందిళ్లలో ఆర్జీ–1యాజమాన్యం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే ఉచిత మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి లక్ష్మి విజ్ఞప్తి చేశారు. సింగరేణిలోని వైద్య నిపుణులతో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.



దుమ్ముతో తప్పని తిప్పలు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ నుంచి పర్మనెంట్ టౌన్‌షిప్ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా దుమ్ముతో నిండిపోయింది. రోడ్డు నిర్మాణ పనులు పొందిన సదరు కాంట్రాక్టర్ నిర్మాణ పనులు వాయిదా వేయడంతో ప్రజలు తీవ్ర దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులు పరిష్కరించాల్సిన కార్పొరేషన్‌లో పాలకవర్గం అలసత్వం ప్రదర్శించడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ప్రజలు దుమ్ముతో అవస్థలు పడుతున్నారు. సదరు కాంట్రాక్టర్‌తో రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉంది.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: స్థానిక శ్రీకాకతీయ జూనియర్ కళాశాల విద్యార్థులు నిఖిలేంద్ర, కృష్ణసాయి, షణ్ముఖ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కరీంనగర్‌లోని అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన అండర్–19 క్రికెట్ బాలుర విభాగంలో ప్రతిభచాటారు. గద్వాల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఆకుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఇ.ఉపేందర్, ఫిజికల్ డైరెక్టర్ బోయిని తిరుపతి, అధ్యాపకులు అభినందించారు.

ప్రజల ఆరోగ్యస్థితిపై ఇంటింటా సర్వే



సర్వే చేస్తున్న విద్యార్థులు

కమాన్‌పూర్: రామగుండం ప్రభుత్వ వైద్య కళాశాల (సీమ్స్) ఆధ్వర్యంలో గురువారం వైద్య కళాశాలకు చెందిన 2023–24 బ్యాచ్ విద్యార్థులు ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమంలో భాగంగా సర్వే చేశారు. మండల కేంద్రంలో ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ఇంటింటా సర్వే చేస్తూ రికార్డులు నమోదు చేశారు. కళాశాల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి వైద్య విద్యార్థికి కేటాయించిన ఐదు కుటుంబాలను రెండున్నర ఏళ్లపాటు వారి ఆరోగ్య స్థితిగతులను నమోదు చేస్తారు. వారికి వైద్య సహాయం అందించడంలో సహాయ పడుతుంటారు. సీమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ శ్రీదేవి, మంథని డిప్యూటీ డీఎంహెచ్‌వో రవిసింగ్, పీహెచ్‌సీ వైద్యాధికారి అశోక్‌కుమార్, కళాశాల సిబ్బంది రవీందర్, ప్రేమలత, నాగరాజు పాల్గొన్నారు.

నేత్రదాత కుటుంబానికి అభినందనలు



జ్ఞాపిక అందజేస్తున్న సభ్యులు

ముత్తారం: మండలంలోని లక్కారం మాజీ సర్పంచ్, ఎంపీటీసీ నాగుల మల్యాల లింగస్వామి ఇటీవల మృతి చెందారు. కాగా ఆయన రెండు నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు మృతుడి రెండు నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు. గురువారం సంస్మరణ సభను ఆ ఫౌండేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భీష్మచారి నిర్వహించారు. ఆయన అవయవ శరీర నేత్రదానాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం మృతుడి నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన అతడి భార్య లక్ష్మి, కుమారులు రాజశేఖర్, చంద్రశేఖర్‌కు సదాశయ ఫౌండేషన్ జ్ఞాపికను అందించింది.

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం పెంచాలి

సుల్తానాబాద్: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెలకు రూ.10వేల గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ మధ్యాహ్న భోజన పథకం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ కోరారు. ఎన్నికల ముందు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సమ్మె చేస్తున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు సమ్మె ప్రాంతాన్ని సందర్శించి హామీ ఇచ్చారన్నారు. వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.